'అముదం' షాపుల్లో రూ.499కే కిరాణా సరకులు

- విక్రయాలను ప్రారంభించిన పౌర సరఫరాల శాఖ మంత్రి

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అముదం' దుకాణాల్లో దీపావళి పండుగ సందర్భంగా రూ.499లకే 15 రకాల కిరాణా సరకుల విక్రయాలను ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ఆర్.చక్రపాణి మంగళవారం ఉదయం ప్రారంభించారు. గోపాలపురంలోని అముదం దుకాణంలో ఆయన అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... లాభార్జన దృష్టితో కాకుండా ప్రజలకు నాణ్యమైన కిరాణా సరుకులను అందజేయాలనే లక్ష్యంతో 'అముదం ప్లస్' పేరుతో ఈ కిరాణా సరకుల విక్రయాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కిట్‌లో పసుపుపొడి (50గ్రా), ఉప్పు (కేజీ), ఆవాలు (125గ్రా.), మిన



గోపాలపురం షాపులో 'అముదం ప్లస్' విక్రయాలు ప్రారంభిస్తున్న మంత్రి ఆర్.చక్రపాణి

ప్పప్పు (125గ్రా) జీలకర (100గ్రా), మెంతులు(100గ్రా), సోంపు(50గ్రా), మిరియాలు(50గ్రా), మిరపకాయలు (250గ్రా), ధనియాలు (500గ్రా), చింతపండు (500గ్రా), ఉద్దిపప్పు (500గ్రా), చెనగపప్పు (200గ్రా), పెసరపప్పు(200గ్రా), సెనగలు(200గ్రా), ఇంగువ (15గ్రా) ఉంటాయని, ఈ సరకుల మొత్తం బరువు 3.840 కిలోలని తెలిపారు. 'అముదం ప్లస్' కిరాణా సరకులు గోపాలపురం, అన్నానగర్, పెరియార్‌నగర్ అముదం దుకాణాల్లోను, అడయార్, చూళైమేడు, చింతాద్రిపేట, కేకే నగర్, నందనం ప్రాంతాల్లో ఉన్న అముదం రేషన్ షాపుల్లోనూ లభిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహార వినియోగ వస్తువుల భద్రతా విభాగం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.రాధాకృష్ణన్, ఎంపీ దయానిధి మారన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, థౌజెంట్ లైట్స్ శాసనసభ్యుడు డాక్టర్ ఎళిలన్ నాగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లు సుపరిపాలన

- అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం
- నామక్కల్ సభలో సీఎం స్టాలిన్
- రూ.298కోట్ల పథకాలకు ప్రారంభోత్సవం


నామక్కల్ బస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా, అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, మహిళాభ్యుదయానికి అగ్రతాంబూలం ఇస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఇటు ప్రజా సంక్షేమం, అటు పారిశ్రామిక పథకాలపై, ఇక కీలకమైన వ్యవసాయ పథకాలపై సమాన దృష్టి సారించి డీఎంకేకు ఓటేయనివారు కూడా మెచ్చుకునేలా పరిపాలన చేస్తున్నామని చెప్పారు. నామక్కల్ జిల్లాలో రూ.298.02 కోట్లతో పూర్తయిన పథకాలను ఆయన మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించారు. నామక్కల్ సమీపం


ఆదిద్రావిడ సంక్షేమ శాఖ తరఫున దివ్యాంగురాలికి స్కూటీ అందజేస్తున్న స్టాలిన్

బొమ్మైకుట్టిమేడు ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆ జిల్లాలో రూ.365.69 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ తమిళ కవి నామక్కల్ రామలింగనార్ జన్మించిన సీమలో ఏర్పాటైన సభలో పాల్గొనటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. సచివాలయం పక్కనే ఉన్న భవనానికి ఆ కవి పేరు పెట్టిన ఘనత అప్పటి డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుఉందన్నారు. రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుంటే ప్రతిపక్షనేత ఎడప్పాడి అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. సిటీ, టవున్ బస్సుల్లో వెలుగుబాట పయనం చేస్తున్న మహిళలు, ప్రతినెలా కలైంజర్ సాధికారిక నగదు పొందుతున్న గృహిణులు, ప్రతినెలా రూ.1000లు పొందుతున్న విద్యార్థినుల ముఖాల్లో వెల్లివిరుస్తున్న సంతోషాలు ప్రతిపక్షనేతకు కనబడకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ తరఫున నామక్కల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రూ.101.19 కోట్లతో నిర్మించిన న్యాయకళాశాల భవనం, హాస్టల్ భవనం, రూ. 19.50 కోట్లతో నిర్మించిన డాక్టర్ కలైంజర్ శతజయంతి స్మారక బస్ స్టేషన్‌తోపాటు పలు శాఖలకు చెందిన భవనాలు తదితర పథకాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. పాడి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రూ.89.30 కోట్లతో నిర్మించనున్న పాలశీతలీకరణ కేంద్రం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు తదితర పథకాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇక వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 16,031 మంది లబ్ధిదారులకు రూ.146.56 కోట్ల మేర సహాయాలను కూడా అందజేశారు. అంతకు ముందు నామక్కల్ కార్పొరేషన్ ఉద్యానవనంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఆర్ రాజేంద్రన్, మదివేందన్, ఎంపీలు కేఆర్‌ఎన్ రాజేష్‌కుమార్, వీఎస్ మాతేశ్వరన్, కేఈ ప్రకాష్, శాసనసభ్యులు కే పొన్నుసామి, పి. రామలింగం, ఈఆర్ ఈశ్వరన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, నామక్కల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. ఉమా తదితరులు పాల్గొన్నారు.




నామక్కల్ బస్‌స్టేషన్ ముఖద్వారం



టి.నగర్‌లో నిఘానేత్రం


పోలీసు అధికారులతో కలసి టి.నగర్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ అరుణ్

- 64 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్


రద్దీగా ఉన్న రంగనాథన్ వీధి

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి రద్దీని పురస్కరించుకొని టి.నగర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 64 సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ పేర్కొన్నారు. వ్యాపార కేంద్రమైన టి.నగర్‌లో ఏర్పాటుచేసిన భద్రతా ఏర్పాట్లను మంగళవారం పోలీస్ కమిషనర్ అరుణ్ అధికారులతో కలసి పరిశీలించారు. అదే విధంగా టి.నగర్ కంట్రోల్ రూమ్ పనితీరు గురించి అక్కడున్న టెక్నీషియన్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... దీపావళి పండుగను నగరవాసులు ప్రమాదరహితంగా ఆనందంగా జరుపుకోవాలని, ముఖ్యంగా శబ్ద, వాయుకాలుష్యం నివారించేలా వ్యవహరించాలని కోరారు. పండుగను పురస్కరించుకొని నూతన వస్త్రాలు, నగలు, టపాసులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని, నగరంలో టి.నగర్, పురుషవాక్కం, ఎగ్మూర్, మైలాపూర్, అడయార్ ప్రాంతాల్లో కొనుగోలుదారులకు మెరుగైన వసతులు కల్పించాల్సిందిగా దుకాణాల యజమానులకు సూచించినట్లు తెలిపారు. టి.నగర్ రంగనాథన్ వీధి చుట్టుపక్కల 64 సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయని, మరో 7 వాచ్ టవర్లున్నాయని, రద్దీలో పిల్లలు తప్పించుపోకుండా వారి చేతుల్లో గుర్తింపు కార్డు కట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో ప్రజలు అందజేసే ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడతామని, అదే విధంగా మాజీ నేరస్తుల ఫొటోలు తదితర వివరాలతో పోస్టర్లు కూడా అంటించినట్లు తెలిపారు. తాంబరం, కిలాంబాక్కం ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ అందుబాటులో ఉన్నందువల్ల కోయంబేడు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గిందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

బంగాళాఖాతంలో తుఫాన్

- 9 ఓడరేవుల్లో ఒకటో నెంబర్ సూచిక
- రాష్ట్రానికి 5 రోజుల వర్షసూచన

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉత్తర అండమాన్‌కు చేరువగా సోమవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం బలపడి తీవ్ర రూపం దాల్చిందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని 9 ఓడరేవుల్లో ఒకటో నెంబర్ సూచిక ఎగురవేశారు. గత ఆదివారం ఉత్తర అండమాన్ సముద్రానికి చేరువగా ఏర్పడిన అల్పపీడనం, సోమవారం సాయంత్రం 5.30 గంటలకు తూర్పు మధ్య బంగాళాఖాతం వద్ద తీవ్రంగా మారింది. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం ఉదయం మధ్య తూర్పు బంగాళాఖాతంలో వాయుగుండంగా మారింది. ఈ వాయుగుండం బుధవారం తుపానుగా మారే అవకాశం ఉంది. ఆ తుఫాన్ వాయువ్య దిశగా పయనించి గురువారం ఉదయం వాయువ్య బంగాళాఖాతం మీదుగా ఒడిశా - పశ్చిమబెంగాల్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ వాయుగుండం కారణంగా మద్రాసు ఓడరేవు, ఎన్నూరు, కాట్టుపల్లి, కారైక్కాల్, తూత్తుకుడి, కడలూరు, నాగపట్టినం, పాంబన్ ఓడరేవుల్లో ఒకటో నెంబర్ తుపాను సూచిక ఎగురవేశారు. ఈ వాయుగుండం ప్రభావంతో రెండు రోజులపాటు తూర్పు బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం, మధ్య పశ్చిమ బెంగాల్ సముద్రం, ఆంధ్రా సముద్రతీరాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. కాగా బుధవారం ఏర్పడనున్న తుఫాన్‌కు ఖతార్ దేశం ఇదివరకే 'డానా' అనే పేరు పెట్టిన విషయం విదితమే.

వర్ష సూచన..

బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుఫాన్, ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో ఐదు రోజులపాటు చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోను, పుదుచ్చేరి, కారైక్కుడి ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. తంజావూరు, పుదుకోట, శివగంగ, మదురై, తేని, దిండుగల్ జిల్లాల్లో బుధవారం పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.

నగరంలో మేఘావృతం...

నగరానికి సంబంధించినంత వరకు పలు చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని, సముద్రతీర ప్రాంతాల్లో పెనుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. బుధవారం నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందన్నారు.

ప్రజలే తీర్పిస్తారు

- ఎవరు అధికారంలో ఉండాలో వారే నిర్ణయిస్తారు
- సేలంలో ఈపీఎస్


ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలని కలలు కనడం సహజమేనని అయితే, ఈ నిర్ణయం ప్రజల చేతుల్లో మాత్రమే ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అభిప్రాయపడ్డారు. సేలంలోని కొంగనాపురంలో మంగళవారం సేలం జిల్లా పార్టీ నిర్వాహకుల సమావేశంలో పళనిస్వామి పాల్గొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని మెజార్టీ స్థానాల్లో గెలిపించేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, గతంలో అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం విలేఖరులు అడిగిన ప్రశ్నలకు ఈపీఎస్ సమాధానం చెప్పారు. డీఎంకే మంత్రిపై రూ.400 కోట్ల అవినీతి ఫిర్యాదు వెలుగుచూసిందని మీడియా ద్వారా తెలుసుకున్నానని, దీనిపై పూర్తి వివరాలు తెలియకుండా మాట్లాడడం సరికాదన్నారు. డీఎంకే పాలనలో దాదాపు అన్ని శాఖల్లో మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని, ఈ వివరాలు త్వరలోనే ప్రజల ముందు ఉంచుతానన్నారు. సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం తొలి రాష్ట్రస్థాయి మహానాడు విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పలు సమస్యలపై 36,000 పోరాటాలు నిర్వహించేందుకు అనుమతించామని అయితే, ప్రస్తుత పాలనలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని వ్యాఖ్యానించారు.

మాదకద్రవ్యాల మత్తులో రాష్ట్రం

పోలీసుశాఖకు పూర్తి స్వేచ్ఛ లేనందున రాష్ట్రం మాదకద్రవ్యాల మత్తులో తూగుతోందని ఈపీఎస్ విమర్శించారు. ఆ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నగరంలో ఈ నెల 19వ తేదీ సీఎం అధ్యక్షతన జరిగిన శాంతిభద్రతల పరిరక్షణా సమావేశంలో గంజాయి ఉత్పత్తిని పూర్తిగా నివారించినట్లు చెప్పడం వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర రాష్ట్రాల డీజీపీల వద్ద ఆయా రాష్ట్రాల నుంచి తమిళనాడుకు చట్టవిరుద్ధంగా తరలించే గంజాయి, మాదకద్రవ్యాలను అడ్డుకోవాలని కోరలేదన్నారు. కొకైన్, డ్రగ్స్ మాత్రలు తదితర మాదకద్రవ్యాలు రాష్ట్రం మీదుగా విదేశాలకు స్మగ్లింగ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు.

నవంబరులో పాంబన్ వంతెన ప్రారంభం

- సదరన్ రైల్వే జీఎం ఆర్‌ఎన్ సింగ్


పాంబన్ వంతెన

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాంబన్ కొత్త రైలు వంతెన నవంబరులో ప్రారంభిస్తామని దక్షిణ మండల జనరల్ మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్ తెలిపారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపం పాంబన్ పాక్ జలసంధి సముద్రంలో రూ.550 కోట్లతో కొత్తగా రెండు ట్రాక్‌లతో రైల్వే వంతెన నిర్మాణం పూర్తయింది. ఈ వంతెన మధ్యలో ఏర్పాటుచేసిన హైడ్రాలిక్ వంతెన పనితీరు పరిశీలించారు. అలాగే, కొత్త వంతెనపై తొలుత ఇంజన్, గూడ్సు రైలు, ప్రయాణికులు లేని బోగీలతో రైళ్లు నడిపి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నెలలో వంతెన అందుబాటులోకి వస్తుందనే వార్తల నేపథ్యంలో, పాంబన్ రైలు వంతెనను దక్షిణ మండల జనరల్ మేనేజర్ ఆర్‌ఎన్ సింగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ట్రయల్ రన్ విజయవంతమైందని, వచ్చే నెల నుంచి ఈ వంతనపై రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామని తెలిపారు.

సమాచార దృష్టి

'ఫిజియోథెరపిస్ట్' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 22: రాష్ట్ర ఆరోగ్యశాఖలో 47 ఫిజియోథెరపిస్ట్ పోస్టులు భర్తీకానున్నాయి. ఈ మేరకు తమిళనాడు వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కళాశాల నుంచి సంబంధిత కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ విభాగం అభ్యర్థుల వయోపరిమితి 32 ఏళ్లు కాగా, ఇతర విభాగాలకు వయోపరిమితి లేదు. తమిళ అర్హత పరీక్ష, ఆన్‌లైన్ పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి, తిరునల్వేలి పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు https://mrb.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో నవంబరు 7వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము జనరల్ విభాగాల అభ్యర్థులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ విభాగాల అభ్యర్థులు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

రాష్ట్రానికి రెండు 'అమృత్ భారత్' రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు 'అమృత్ భారత్' రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. 'వందే భారత్' రైళ్లకు దీటుగా, ఏసీ లేని రిజర్వేషన్, జనరల్ బోగీలతో అత్యాధునిక వసతులతో కూడిన 'అమృత్ భారత్' రైళ్లను గత జనవరిలో రైల్వే శాఖ పరిచయం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశవ్యాప్తంగా 26 అమృత్ భారత్ రైళ్లు నడపాలని నిర్ణయించింది. ఆ ప్రకారం, తిరునల్వేలి-షాలిమార్, తాంబరం-సంత్రాగచ్చి మధ్య ఈ రైళ్లు పరిచయం చేయనున్నారు. తిరునల్వేలి నుంచి నడిపే రైలు ద్వారా విరుదునగర్, శివగంగ, పుదుకోట, తిరుచ్చి, విల్లుపురం తదితర ప్రాంతాలు, చెన్నై నుంచి నడిపే రైలు ద్వారా పొరుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

26న ప్రైవేటు సంస్థల జాబ్ మేళా

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ లక్ష్మీ బంగారు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా జరుగనుందని జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు జరిగే ఈ శిబిరంలో 200లకు పైగా సంస్థలు పాల్గొని సుమారు 20 వేల మందిని ఎంపిక చేయనున్నాయి. 8,10,12 తరగతులు ఫెయిల్, పాసైన వారు, బీఈ, ఐటీఐ, డిప్లొమో, నర్సింగ్ తదితరాలు పూర్తిచేసి, 18 నుంచి 40 ఏళ్లలోపున్న వారు విద్యార్హత సర్టిఫికెట్ల నకళ్లు, స్వీయ వివరాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో నేరుగా హాజరుకావచ్చు. వివరాలకు 044-27426020, 6383460933, 8056789359 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

కీళడిలో ఓపెన్ ఎయిర్ మ్యూజియం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కీళడిలో కొత్తగా ఓపెన్ ఎయిర్ మ్యూజియం ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. కీళడిలో రూ.15.69 కోట్లతో ఓపెన్ ఎయిర్ మ్యూజియం ఏర్పాటుచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, రూ.15 కోట్లతో గంగైకొండ చోళపురంలో మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం టెండర్లు విడుదల చేసింది.

25న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ సమాచార, శిక్షణ కేంద్రంలో ఈ నెల 24న వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. అందులో వానపాముల రకాలు, వాటిని పెంచే పద్ధతులు, పంట వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాల సేకరణ, కంపోస్టు తయారీ తదితరాలపై అవగాహన కల్పించనున్నారు. 25వ తేది పుట్టగొడుగులపై పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో శిక్షణకు రూ.1,000 రుసుము చెల్లించాలి. ఆసక్తి కలిగిన వారు 044-2953 0048 సంప్రదించవచ్చని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ శిక్షణా కేంద్రం డైరెక్టర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

25న వ్యవసాయ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 25వ తేది వ్యవసాయ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి వ్యవసాయ, ఉద్యానవన, వ్యవసాయ మార్కెటింగ్, పశుసంవర్థక, మత్స్య, సహకార సంఘాలు, విద్యుత్ బోర్డు, రెవెన్యూ శాఖల అధికారులుతప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

తిరుమళిసై 'సిప్కాట్'లో పారిశ్రామిక స్థలాల విక్రయం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుమళిసై పారిశ్రామికవాడలో, తమిళనాడు సిడ్కో సంస్థకు చెందిన 5 స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా పరిశ్రమలు ప్రారంభించాలనుకొనే వారు ఈ స్థలాలు కొనుగోలు చేయవచ్చే. తిరుమళిసై సిప్కాట్‌లోని ఖాళీ స్థలాలు పరిశీలించేందుకు ఆసక్తి ఉన్న వారు సిడ్కో అసిస్టెంట్ మేనేజర్ వెన్మణి (9445006566)ను అనే నెంబరు ద్వారా సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేషన్ ఉద్యోగులకు 20 శాతం దీపావళి బోనస్

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు దీపావళి బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు దీపావళి బోనస్‌ను ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఆ ప్రకారం, రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 20 శాతం బోనస్ అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

త్వరలో ముడిచ్చూరు ఆమ్నీ బస్‌స్టేషన్ ప్రారంభం

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కిలాంబాక్కం బస్ టెర్మినల్‌కు సమీపంలో రూ.42.70 కోట్లతో నిర్మిస్తున్న ఆమ్నీ బస్‌స్టేషన్ దీపావళి తర్వాత ప్రారంభిస్తామని చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఇన్‌చార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి దామో అన్బరసన్, అధికారులతో కలిసి ముడిచూరు ఆమ్నీ బస్‌స్టేషన్ ప్రాంతంలో జరుగుతున్న చివరి దశ నిర్మాణ పనులను, అదే విధంగా రూ.15.20 కోట్లతో చేపట్టిన కిలాంబాక్కం ఉద్యానవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఆమ్నీ బస్‌స్టేషన్‌లో రెస్టారెంట్లు, రెస్ట్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు తదితర సదుపాయాలు కూడా ఉంటాయన్నారు. ఒకే సమయంలో 150 ఆమ్నీ బస్సులు నిలిపేందుకు వీలుంటుందన్నారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్ సమీపంలో 16 ఎకరాల విస్తీర్ణంలో పురావస్తు శాఖ అనుమతితో చేపట్టిన కాల నిర్దేశిత ఉద్యానవనం నిర్మాణ పనులన్నీ రెండు వారాల్లో పూర్తవుతాయని చెప్పారు. ఈ ఉద్యానవనంలో పురావస్తు పరిశోధన అవగాహన కేంద్రం, వాననీటి సేకరణ తెలిపేలా మూడు కొలనులు, కాలినడక ఫ్లైఓవర్, చిన్నారుల క్రీడా మైదానం, విగ్రహాల కేంద్రం, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎగ్జిబిషన్ వేదిక ఉంటాయని ఆయన వివరించారు. ఇక కిలాంబాక్కం బస్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేలా సీఎండీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారని, రెండు మూడు రోజుల్లో ఈ జిల్లా మంత్రి దామో అన్బరసన్‌తో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించనున్నామని చెప్పారు. ఇదేవిధంగా కిలాంబాక్కం బస్ టెర్మినల్ వద్ద స్కై వాక్ పనులు కూడా చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. మంత్రులతో పాటు చెంగల్పట్టు ఎమ్మెల్యే వరలక్ష్మి, గృహ వసతి నగరాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, సీఈఓ ఎ.శివజ్ఞానం, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్, కాట్టాన్‌కుళత్తూరు పంచాయతీ యూనియన్ ఛైర్‌పర్సన్ ఉదయా కరుణాకరన్ తదితరులు పర్యటించారు.


ముడిచ్చూరు ఆమ్నీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, దామో అన్బరసన్

బాణసంచా దుకాణాల టెండర్లకు హైకోర్టు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించేందుకు సహకార సంఘానికి మద్రాసు హైకోర్టు అనుమతించింది. టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ చెన్నై బాణసంచా విక్రయదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు ముగిసిన నేపథ్యంలో, టెండర్ల ప్రక్రియను అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

సహకార శాఖ ఆధ్వర్యంలో షాపులు...

సహకార శాఖ ఆధ్వర్యంలో బాణసంచా విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ట్రిప్లికేన్ నగర సహకార సంఘం ఆధ్వర్యంలో తేనాంపేట కామధేను కాంప్లెక్స్, అడయార్, బీసెంట్ నగర్, వేళచ్చేరి, సాలిగ్రామం, ఆర్‌ఏ పురం, ట్రిప్లికేన్, పెరియార్ నగర్, విల్లువాక్కం తదితర 9 ప్రాంతాలు, కాంచీపురం జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో పల్లావరం, క్రోంపేట, ఈస్ట్ తాంబరం, సెంబాక్కం, వెస్ట్ తాంబరం షణ్ముగం రోడ్డు, ఆలందర్, పోరూర్, చెంగల్పట్టు, కాంచీపురం తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో బాణసంచా విక్రయాలు జరుగనున్నాయి. బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువగా ఈ దుకాణాల్లో ప్రజలు బాణాసంచా పొందవచ్చని అధికారులు తెలిపారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.80 లక్షలు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి స్వామివారి హుండీ ఆదాయం రూ.80 లక్షలు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ ఆలయ హుండీల లెక్కింపు సోమవారం ఆలయ ప్రాంగణంలోని వసంత మండపంలో జాయింట్ కమిషనర్ రమణి నేతృత్వంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు, రూ.80.07,917 నగదు, 234 గ్రాముల బంగారం, 456 గ్రాముల వెండి కానుకగా సమర్పించారని అధికారులు తెలిపారు.

ఐదు జోన్లలో రెండు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపివేత

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్‌లోని ఐదు జోన్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు చెన్నై మెట్రో వాటర్ బోర్డు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.... పురసైవాక్కం హైరోడ్డులో తాగునీటి ప్రధాన పైపుల అనుసంధానం చేపట్టనున్నారు. ఈ కారణంగా 23వ తేదీ 8 గంటల నుంచి 24వ తేదీ సాయంత్రం వరకు 32 గంటల వరకు నీటి సరఫరా నిలిపివేయనున్నారు. జోన్ 4, 5, 6, 8, 9 ప్రాంతాల్లోని తండయారుపేట, పురసైవాక్కం, పెరియమేడు, షావుకారుపేట, ఎగ్మోర్, చింతాద్రిపేట, ఓట్టేరి, అయనారం, పెరంబూరు, సేంబియం, కీల్పాక్కం, విల్లివాక్కం, కెల్లీస్, ట్రిప్లికేణి ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు మెట్రోవాటర్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

దంత వైద్యకళాశాలకు రూ.64 కోట్లు కేటాయింపు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి హైరోడ్డు-ముత్తుస్వామి రోడ్డు జంక్షన్ సమీపంలో పోర్ట్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న చెన్నై ప్రభుత్వ దంత వైద్యకళాశాల, ఆస్పత్రి ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64 కోట్లు కేటాయించింది. దేశంలో మూడవ పురాతన వైద్యకళాశాల, దక్షిణాదిన తొలి ప్రభుత్వ దంత వైద్యశాలగా పేరుగాంచింది. ఈ కళాశాల విద్యార్థులకు తగిన మౌలిక వసతుల కల్పనకు వైద్యకళాశాల ఆస్పత్రిని ఆధునికీకరించనున్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, తాజాగా ఆస్పత్రి భవనంపై నాలుగో అంతస్తు నిర్మించేందుకు రూ.56.5 కోట్లు, కొత్త వైద్య పరికరాలు, 100 కొత్త డెంటల్ కుర్చీలు సహా పలు సామగ్రి కొనుగోలుకు మరో రూ.7.59 కోట్లు కేటాయించినట్లు సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

దివ్యాంగులకు సేవచేసిన వారికి పురస్కారాలు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం, వారికి సేవలు చేసిన వ్యక్తులు, సంస్థలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిసెంబరు 3వ తేది దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయనున్నారు. అంధులు, బధిరులు, మతిస్థిమితం లేని సహా 10 రకాల దివ్యాంగులకు సేవచేసిన వారు, అలాంటి దివ్యాంగులకు బోధించే ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వనున్నారు. పురస్కారంలో భాగంగా తలా 10 గ్రాముల బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పనిచేస్తున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

దీపావళి బోనస్ కోసం రెండోరోజూ ధర్నా


ధర్నాలో టోల్‌గేట్ సిబ్బంది

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బోనస్ ప్రకటించాలనే డిమాండ్‌తో పుదుకోటలోని టోల్‌గేట్ సిబ్బంది చేపట్టిన ఆందోళన మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. లేనావిలికిల్ ప్రాంతంలోని టోల్ ప్లాజాలో సుమారు 50 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి దీపావళి బోనస్ కేటాయింపుపై జరిగిన చర్చలు కొలిక్కిరాలేదు. దీంతో సోమవారం నుంచి బోనస్ కోసం ఆందోళన చేపట్టారు. టాక్స్ వసూలుచేసే కౌంటర్లు మూసివేసి గేట్లు ఎత్తివేయడంతో వాహనాలన్నీ పన్ను చెల్లించకుండానే వెళ్తున్నాయి. కొంతమంది వాహనచోదకులు సిబ్బంది చేపట్టిన ఆందోళన దీపావళి పండుగ వరకు కొనసాగాలని కాంక్షిస్తూ వీడియోలో పోస్టులు పెడుతున్నారు.

నీటమునిగిన పంట


తడిచిన పంటను చూపిస్తున్న రైతులు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో కొద్దిరోజులుగా మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా పొలాల్లో కోసిన వరి చేలు నీట మునిగింది. ఒకత్తనాడు, తిరుమంగళకోట, చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో వరి నీట మునిగింది. వారం రోజులుగా పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో ధాన్యం పూర్తిగా నానింది. పంట చేతికొచ్చే సమయంలో నీటమునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటను ఎకరాకు రూ.30 వేలు అందించాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్రంలో పోలీసులకే భద్రత లేదు

● మాజీ మంత్రి డి.జయకుమార్

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించే పోలీసులకే రక్షణ కరువైందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ ఆరోపించారు. పట్టిణంబాక్కం లూప్ రోడ్డులో రెండు రోజుల క్రితం ఓ జంట పోలీసులను బెదిరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఈ వ్యవహారంపై జయకుమార్ స్పందిస్తూ... పోలీసులపై దుర్భాషలాడిన ఆ జంట, ఉదయనిధి, కనిమొళిలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలుసన్నారు. అలాంటి వారిపై సత్వరం ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు రావడంతో వారి వెళ్లిన కొన్ని గంటలకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి వారిని అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రజలకు భద్రత కల్పించేలా 24 గంటలు శ్రమిస్తున్న పోలీసులకు ప్రస్తుతం భద్రత కరువైందన్నారు. పోలీసులపై జరుగుతున్న దాడులు అడ్డుకొనేలా చర్యలు చేపట్టడంతో పాటు వారి స్వేచ్ఛగా, స్వతంత్రగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జయకుమార్ డిమాండ్ చేశారు.

నీటిమునిగి మృతిచెందిన వారి కుటుంబాలకు సీఎం సంతాపం

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు సమీపంలో నీటమునిగి మృతిచెందిన ముగ్గురి కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. సేలం జిల్లా వీరక్కల్ గ్రామానికి చెందిన శివనందిని (20), శివగిరి (10), దివ్యదర్శిని (14)లు కొత్తుకుట్ట చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి నీటమునిగి మృతిచెందారనే వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి తలా రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలగుండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ కార్యాలయంలో లంచాలు తీసుకుంటున్నారని దిండుగల్ జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజరాజ్ నేతృత్వంలో పోలీసులు కార్యాలయంలో జరిపిన సోదాల్లో లెక్కల్లో చూపని రూ.82,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్ దురైస్వామి, ఉద్యోగులను పోలీసులు విచారిస్తున్నారు.

ప్రొఫెసర్ పోస్టులు సత్వరం భర్తీచేయాలి

● ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్

ప్యారీస్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు తక్షణం భర్తీచేయాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 12,000 ప్రొఫెసర్ల పోస్టులుండగా, వాటిలో 8,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిసిందన్నారు. దీనిపై దృష్టి సారించిన ఉన్నత విద్యాశాఖ, త్వరలో 4,000 పోస్టులు భర్తీచేస్తామని ప్రకటించి నెలలు గడిచినా భర్తీకి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రొఫెసర్ల కొరతతో విద్యార్థుల బోధనకు అంతరాయం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని దినకరన్ డిమాండ్ చేశారు.

జీపీఎస్ ద్వారా గద్దల పర్యవేక్షణ

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గద్దలు వలసలు పోవడం, ప్రస్తుత వాటి జీవన విధానం తెలుసుకొనేలా జీపీఎస్ పరికరాల ద్వారా పర్యవేక్షించాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా పలు జంతువులు, పక్షులు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి. అంతరించిపోతున్న జంతు, పక్షి జాతులను రక్షించేలా ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో గద్దల సంరక్షణ సంఘం సమావేశం ఇటీవల కోయంబత్తూర్‌లో జరిగింది. గద్దలకు హాని కలిగించే నిమ్సునైడ్ వంటి మందులు ఉపయోగించడంపై నిషేధం విధించాలి, గద్దలను జీపీఎస్ ద్వారా గణించే అధికారం అటవీ శాఖకు కల్పించాలి, గద్దల జాతుల్లో 23 రకాలు అంతరించిపోయేలా ఉన్నాయని, వాటిని రక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ సెలవుగా విశ్వకర్మ జయంతి

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని జిల్లా విశ్వ జనశక్తి పరిశ్రమ సంఘం పేరుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంఘ నిర్వాహకులు కలెక్టర్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సెక్రటరీ అశోక్‌కుమార్ ఆచారి మాట్లాడుతూ. విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి, హిందూ విశ్వకర్మ పేరుతో జాతి సర్టిఫికెట్లు మంజూరు చేయాలి, విశ్వకర్మ వర్గాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు శవరణ ఆచారి, జిల్లా యువజన విభాగం సెక్రటరీ గణేష్ ఆచారి, మహిళా సెక్రటరీ ఇందిర, సభ్యులు పాల్గొన్నారు.

వేలూరులో తనిష్క్ రెండో షోరూమ్


షోరూమ్ ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో టాటా సంస్థకు చెందిన తనిష్క్ నగల దుకాణం రెండో షోరూమ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. టైటన్ కంపెనీ ప్రొ అధ్యక్షుడు శరత్ షోరూమ్ ప్రారంభించారు. ఆయన వెంట నిర్వాహకులు శరవణన్, సర్కిల్ మేనేజర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ... మా షోరూమ్ పాత నగలు ఇచ్చి కొత్త నగలు కొనుగోలు చేయవచ్చన్నారు.

కవరపేట ప్రమాదంపై స్టేషన్ మాస్టర్ సహా నలుగురి విచారణ

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కవరపేట రైల్వేస్టేషన్ వద్ద గూడ్సురైలును భాగమతి ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంపై రైల్వే భద్రతా విభాగం ఉన్నతాధికారులు ఆ స్టేషన్ మాస్టర్ సహా నలుగురి వద్ద మంగళవారం ఉదయం విచారణ జరిపారు. చెన్నై రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేశాఖ కార్యాలయంలో ఈ విచారణ జరిగింది. కవరపేట స్టేషన్ మాస్టర్, జెండా ఊపే సిబ్బంది, గేట్ కీపర్, స్టేషన్ సూపరింటెండెంట్‌లను అధికారులు విచారించారు. ఈ దుర్ఘటన వెనుక కుట్ర దాగి ఉందా అనే కోణంలో విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించి 21 మందికి సమన్లు జారీ చేసి వరుసగా విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

నాలుగు విశ్వవిద్యాలయాలపై కోర్టు ఉల్లంఘన కేసు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు విశ్వవిద్యాలయాలపై హైకోర్టు మదురై బెంచ్ సుమోటోగా కోర్టు ఉల్లంఘన కేసు నమోదుచేసింది. నేరస్తులను కాపాడాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్న వారిపై క్రిమినల్ కేసు పెడతామని న్యాయస్థానం హెచ్చరించింది. గ్రూప్-1 పరీక్షల్లో తమిళ మీడియంలో చదువుకున్నట్లు నకిలీ పత్రాలు సమర్పించి ఉద్యోగంలో చేరిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ కేసు దాఖలైంది. ఈ కేసు విచారణ మంగళవారం న్యాయమూర్తులు వేల్‌మురుగన్, పుహళేంది బెంచ్ సమక్షంలో విచారణకు వచ్చింది. అప్పుడు అన్నామలై విశ్వవిద్యాలయం, పెరియార్ విశ్వవిద్యాలయం, మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి గత రెండేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగంలో చేరిన వారిపై చేపట్టిన చర్యలకు సంబంధించి ఎలాంటి వివరాలు న్యాయస్థానంలో దాఖలు చేయకపోవడంతో, ఈ విశ్వవిద్యాలయాలపై కోర్టు ఉల్లంఘన కేసు నమోదుచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ విశ్వవిద్యాలయాలు తగిన దస్తావేజులు సమర్పించని పక్షంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి వివరాలతో కూడిన దస్తావేజులను స్వాధీనం చేసుకోవచ్చని న్యాయమూర్తుల బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

స్వయం సహాయక సంఘాలకు రూ.8.24 కోట్ల రుణాలు


లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రం తరపున స్వయం సహాయక సంఘాలు, చిరు పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 33 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, 15 మంది మహిళా స్వయం సహాయక బృందాలకు మొత్తం రూ.8.24 కోట్ల ఆర్థికసాయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ రమణి, బ్యాంకుల మేనేజర్లు బాబు (ఎస్బీఐ), రామచంద్ర బాబు (ఇండియన్ బ్యాంక్), మాధవకుమార్ ముత్తు (కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్), జిల్లా లీడింగ్ బ్యాంక్ మేనేజర్ జమాల్ మొయిద్దీన్, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, ఉప రిజిస్ట్రార్ సురేష్ గుప్తా, పథక అసిస్టెంట్ విజ్ఞాని మణికంఠన్, జిల్లా సూక్ష్మ, చిన్న వృత్తుల అభివృద్ధి సంఘం నాగరాజన్, జిల్లా ఆర్గనైజర్ (ఆడిటింగ్) ఉదయకుమార్, టెక్నాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి మించి ఆస్తులు

డీఎంకే కౌన్సిలర్, భర్తపై కేసు నమోదు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన వ్యవహారంలో డీఎంకే కౌన్సిలర్, ఆమె భర్త, ఆమె తల్లి, అత్తపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదుచేశారు. కాంచీపురం జిల్లా వాలాజాబాద్ పంచాయతి యూనియన్ కౌన్సిలర్ రాజలక్ష్మి భర్త కుజరాజ్ నీటిపారుదల శాఖ పాలారు సబ్ డివిజన్‌లో ఏఈగా పనిచేస్తున్నారు. రాజ్యలక్ష్మి తల్లి రాజేశ్వరి (58) భర్త కొద్ది కాలం క్రితం మరణించారు. ఈ నేపథ్యంలో, వీరు రాజ్యలక్ష్మి ఏజెన్సీస్ పేరుతో సంస్థ ఏర్పాటుచేసి 2009లో చెంగల్పట్టు, 2010లో వాలాజాబాద్ పంచాయతి యూనియన్ రహదారుల శాఖలో కాంట్రాక్ట్ సంస్థగా పేరు నమోదుచేసి, పలు కాంట్రాక్ట్‌లు పొందారు. ఈ క్రమంలో, రాజ్యలక్ష్మి, ఆమె భర్త కుజరాజ్, అత్త తమిళరసి (77) ఆదాయానికి మించి రూ.5.21 కోట్ల ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ కేసు నమోదైంది. 2016-22 కాలంలో ఆదాయానికి మించి రూ.3.98 కోట్లు కూడబెట్టారని, స్థలాలు, ఫాంహౌస్‌లు, లగ్జరీ కార్లు కొనుగోలు చేసినట్లు కేసులో పేర్కొన్నారు.

మసీదు, స్టార్‌హోటల్‌కు బాంబు బెదిరింపు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టార్ హోటల్‌కు, మసీదుకు మంగళవారం ఉదయం ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. థౌజెంట్‌లైట్స్ ప్రాంతంలో 'సియా' మసీదుకు బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ నిపుణులు వెళ్ళి ఆ మసీదు అంతటా తనిఖీ చేశారు. చివరకు అది ఉత్తుత్తి బెదిరింపని నిర్ధారించారు. ఈ మసీదుకు బాంబు బెదిరింపు రావటం నాలుగోసారి అని మసీదు నిర్వాహకులు తెలిపారు. ఇదే విధంగా టి.నగర్‌లోని ఓ స్టార్ హోటల్‌కు కూడా ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి తనిఖీ చేసి అది కూడా ఉత్తుత్తి బెదిరింపేనని తెలుసుకున్నారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఈమెయిల్ ఆధారంగా బాంబు బెదిరింపు చేసిన వ్యక్తుల ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థినిపై అత్యాచారం

● ప్రియుడి సహా ఇద్దరి అరెస్టు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా తాళకుడి ప్రాంతానికి చెందిన 17 యేళ్ళ నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఆమె ప్రియుడి సహా మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. తాళకుడి ప్రాంతానికి చెందిన 17 యేళ్ళ బాలిక ప్లస్‌టూ పూర్తి చేసి ఓ ప్రైవేటు కాలేజీలో నర్సింగ్ చేస్తుంది. ఈమెకు సోషల్ మీడియాలో సౌరియాపురానికి చెందిన యువకుడి (20)తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాలికను ఆ యువకడు పలుమార్లు తన ఇంటికి తీసుకెళ్ళి ఏకాంతంగా గడిపాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో రఘునాథన్ అనే పొరుగింటి వ్యక్తి చూసాడు. ఓ రోజున యువకుడితో కలిసి బాలిక ఇంటిలో ఉండగా, రఘునాథన్ వెళ్ళి, తనతో కూడా గడపాలని బాలికపై ఒత్తిడి చేశాడు. దీనికి సమ్మతించకపోవడంతో ఆమెపై లైంగిక దాడికి యత్నించగా, బాలిక అరుస్తూ ఇంటి నుంచి వెళ్ళి కన్నియాకుమారి ఆల్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రియుడితో పాటు రఘునాథన్‌ను అరెస్టు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న అంబులెన్స్

● ప్రభుత్వ వైద్యుడి మృతి

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో అంబులెన్స్ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో చెన్నై నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే సెంథిల్ కుమార్ (31) అనే వైద్యుడు మృతి చెందారు. ఈ ప్రమాద వివరాలను పరిశీలిస్తే, ఈరోడ్ జిల్లా శివగిరి సమీపంలోని తండంపాళయం ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్ ప్రభుత్వ వైద్యుడిగా చెన్నై లో పనిచేస్తున్నాడు. ఇటీవల ఈయన జ్వరానపడ్డారు. దీంతో సొంతూరు వెళ్ళి చికిత్స పొందుతున్నారు. అయితే, ఈ జ్వరం ఎంతకీ తగ్గకపోవడంతో ఈరోడ్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌లో చేరేందుకు అంబులెన్స్‌లో బయలుదేరాడు. ఈ అంబులెన్స్ ఈరోడ్ జిల్లా మొడకురిచ్చి సమీపంలో వెళ్తుండగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సెంథిల్ కుమార్ మృతి చెందగా, అంబులెన్స్ డ్రైవర్ గౌతమ్ (25), అతని అసిస్టెంట్ తీవ్రంగా గాయపడగా, వీరిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంపె పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పార్కింగ్ సిబ్బందిపై దాడి: ముగ్గురి అరెస్టు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం ఐదు రథాల ప్రాంతంలోని హస్తకళా వస్తు విక్రయ కేంద్రంలో పార్కింగ్ సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఇద్దరు మహిళల సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేంద్రానికి కారులో వచ్చినవారు ఇతర వాహనాలకు అడ్డంగా కారు పార్కింగ్ చేశారు. అది చూసిన పార్కింగ్ సిబ్బంది.. కారును పార్కింగ్ స్థలంలో పార్క్ చేయాలని సూచించారు. అయితే, కారులోని ఇద్దరు మహిళలు పార్కింగ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి, దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై మహాబలిపురం పోలీసులు కేసు నమోదు చేసి, చెన్నై ముడిచ్చూరుకు చెందిన ప్రభుదాస్ (41), షణ్ముగప్రియ (38), కీర్తన (29) అనే వారిని అరెస్టు చేశారు.

నగరంలో 2,069 గృహాలతో ఫ్లాట్లు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం, తిరువికనగర్ మండలాల్లోని మూడు ప్రాంతాల్లో పునరాభివృద్ధి పథకం కింద 2,069 గృహాలతో కూడిన ప్లాట్లను అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు నిర్మించనుంది. ఈ విషయమై బోర్డు అధికారి ఒకరు మాట్లాడుతూ... చెన్నై కార్పొరేషన్ పరిధిలోని రాయపురం మండలంలో పాత భవనాలు కూల్చివేసి, 269 గృహాలతో కూడిన 9 అంతస్తుల ప్లాట్లు, ఇదే మండలంలోని సీఎండీఏ ఉత్తర చెన్నై అభివృద్ధి పథక నిధులతో 11 అంతస్తుల్లో 1,500 గృహాలతో ప్లాటు, తిరువికనగర్ మండలంలో 300 గృహాలతో కూడిన నాలుగు అంతస్తులతో కూడిన ప్లాట్ల నిర్మాణపనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

కోలీవుడ్ హీరోయిన్‌గా మలయాళ భామ

తమిళ చిత్రపరిశ్రమకు హీరోయిన్‌గా మరో కేరళభామ పరిచయమవుతోంది. పేరు సానియ అయ్యప్పన్. బాల నటిగా మలయాళ చిత్రపరిశ్రమకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'క్వీన్' చిత్రం ద్వారా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. మమ్మూట్టి నటించిన 'లూసీఫర్' చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా రెండో భాగంలోనూ నటిస్తున్నారు. అలాగే, 'సెల్యూట్', 'సాటర్ డే నైట్' వంటి పలు మలయాళ చిత్రాల్లో నటించారు. తమిళంలో గత యేడాది విక్రమ్ ప్రభు - శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'ఇరుగపట్రు' ఆంథాలజీ చిత్రంలో ఓ క్యారెక్టర్‌లో నటించారు. ఇపుడు ఆర్జే బాలాజీ - సిద్ధార్థ్ విశ్వనాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'స్వర్గవాసల్' మూవీలో హీరోయిన్‌గా అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. తమిళంలో హీరోయిన్‌గా చేసే అవకాశం చాలా రోజులకు తర్వాత వచ్చిందంటూ ఆమె సంతోషం వ్యక్తం చేశారు.



సానియ అయ్యప్పన్

చిత్రజ్యోతి

2కే కిడ్స్‌ను అలరించేలా

శింబు కొత్త చిత్రం



కొత్త చిత్రంలో శింబు

హీరో శింబు నటించే 49వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. 2కే కిడ్స్‌ను ఆలరించేలా ఈ సినిమా తెరకెక్కించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ బ్యానరుపై కల్పాతి ఎస్.అఘోరం భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. 'ఓ మై కడవులే' ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకుడు. రెండు రోజుల క్రితం శింబు తన ట్విట్టర్ ఖాతాలో ఓ ట్వీట్ చేస్తూ, 'దమ్ + మన్మథన్ + వల్లవన్ + వీటీవీ ఇన్ జెన్ జడ్ మోడ్ = నంబ ఎగ్జిట్, డేయ్ 2కే కిడ్స్.. నైంటీస్ మూడ్‌లో రేపు షార్ప్‌గా 6.06 గంటలకు వస్తాను' అంటూ పోస్ట్ చేశారు. ఆ ప్రకారంగానే సోమవారం సాయంత్రం 6.06 గంటలకు తన కొత్త చిత్రానికి సంబంధించిన అఫీషియల్ ప్రకటన చేస్తూ, ఓ పోస్టరు కూడా రిలీజ్ చేశారు. ఇందులో చేతిలో బ్లాక్ వైర్, మరో చే తిలో కర్చీఫ్, మెడపై టాటూ.. నేటి జనరేషన్‌కు తగ్గట్టుగా లుక్ డిజైన్ చేశారు. ఈ పోస్ట్ శింబు ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రేక్షకులను సైతం ఎంతగానో ఆకర్షిస్తోంది. ఇకపోతే, శింబు చేతిలో ఉన్న ప్రాజెక్టులను పరిశీలిస్తే, కమల్ హాసన్ - మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'థగ్‌లైఫ్' చిత్రంలో ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అలాగే, కమల్ హాసన్ నిర్మాతగా, దేశింగ్ పెరియస్వామి దర్శకత్వంలో హిస్టారికల్ నేపథ్యంలో ఓ చిత్రానికి ఒక యేడాది క్రితం ప్లాన్ చేశారు. ఈ మూవీకి భారీ బడ్జెట్ అవుతుందని అంచనా వేయడంతో తాత్కాలికంగా పెండింగ్‌లో ఉంది. దీంతో ఇతర చిత్రాలపై శింబు దృష్టిసారించారు.

డిసెంబరు నుంచి 'తుప్పరివాలన్-2' షూటింగ్?



విశాల్

విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై హీరో విశాల్ కథానాయకుడుగా నటిస్తూ, దర్శకత్వం వహించనున్న 'తుప్పరివాలన్-2' చిత్రం షూటింగ్ డిసెంబరు నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లండన్, మలేసియా, అజర్‌బైజాన్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేపట్టాలని భావిస్తున్నారు. 2017లో మిష్కిన్ దర్శకత్వంలో వచ్చిన 'తుప్పరివాలన్' ఘన విజయం సాధించడంతో రెండో భాగాన్ని తెరకెక్కించనున్నట్టు 2019లో ప్రకటించి, ఇంగ్లండ్‌లో షూటింగ్ ప్రారంభించారు. అయితే, దర్శకుడు మిష్కిన్ - హీరో విశాల్ మధ్య మనస్పర్థల కారణంగా ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో రెండో భాగం స్క్రిప్టులో అనేక మార్పులు చేసిన విశాల్... తానే దర్శకత్వం వహించనున్నట్టు ప్రకటించారు. కానీ, ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇపుడు సినిమా షూటింగ్ డిసెంబరులో ప్రారంభించి విదేశాల్లో చిత్రీకరించాలని భావిస్తున్నారు.

ఫాంటసీ చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేయాలని వుంది

- 'సర్' కెమెరామేన్ ఇనియన్

ఫాంటసీ చిత్రాలకు ఛాయాగ్రహణం అందించాలన్నది తన చిరకాల కోరిక అని 'సర్' చిత్ర కెమెరామేన్ ఇనియన్ జె.హారీస్ అన్నారు. విమల్ హీరోగా నటించిన 'సర్' చిత్రం గత శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం అందించిన ఇనియన్ మాట్లాడుతూ, 'మా ప్రాంతాల్లో జరిగే షూటింగులను చూసి ఎంజాయ్ చేశాను. ఇపుడు అదే సినిమా ఇండస్ట్రీలో కెమెరామేన్‌గా పనిచేశాను. దర్శకుడు బోస్ వెంకట్ తొలిసారి కెమెరామేన్‌గా అవకాశం కల్పించారు. తొలి చిత్రానికే ప్రశంసలు వచ్చాయి. రెండో చిత్రం 'యుద్ధకాండం' సింగిల్ షాట్ మూవీ. ఇందులోని సినిమాటోగ్రఫీ ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. జపాన్‌లో జరిగిన ఒసాకా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రంగా నిలిచింది. 15కు పైగా వాణిజ్య ప్రకటనలు చేశాను. విలేజ్, హిస్టారికల్ జానర్‌లో తెరకెక్కిన చిత్రాలకు ఛాయాగ్రహణం అందించాను. ఫాంటసీ సినిమాలకు పని చేయాలని వుంది. ఎందుకంటే విజువల్ ఎఫెక్ట్ కూడా కలిపి పనిచేయొచ్చు. ప్రతి ఫ్రేమ్ ఒక మాయాజాలంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.



ఇనియన్ జె.హారీస్

ఆలయ వేడుకల్లో మాజీ మంత్రి నృత్యం



నృత్యం చేస్తున్న మాజీ మంత్రి వేలుమణి

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణికి సంప్రదాయ నృత్యాలంటే ఎంతో ఆసక్తి. కోయంబత్తూర్ జిల్లా కోటకాడు ముత్తువాళి అమ్మవారు, ముట్టత్తు నాగేసువార్ ఆలయ కుంభాభిషేకం సోమవారం జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న వేలుమణి స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో ఒయిలాట్టం నృత్యం చేస్తుండగా ఆయన కూడా కళాకారులతో కలసి నృత్యం చేశారు.

ఆలయ ఏనుగుకు మణిమండపం



మణిమండపం నిర్మాణపనులు చేపట్టినప్పటి దృశ్యం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథస్వామి ఆలయ ఏనుగు భవానీ 2012లో మరణించింది. కోవై సమీపంలోని తేక్కంపట్టిలో జరిగిన పునరావాస శిబిరంలో పాల్గొన్న సమయంలో నదిలో నీటమునిగి మృతి చెందింది. భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఏనుగు భవానీకి మణిమండపం నిర్మించాలని హిందూ దేవాదాయ శాఖ నిర్ణయించింది. 12 ఏళ్లు గడిచినా మణిమండపం నిర్మాణం చేపట్టలేదు. దీంతో, భక్తుల కోరిక మేరకు రూ.43 లక్షలతో మణిమండపం నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మణిమండపంలో ఆలయ ఏనుగు భవానీ విగ్రహం ఏర్పాటుచేయనున్నట్లు, వచ్చే ఏడాది జూన్‌లో పనులు ముగుస్తాయని అధికారులు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వర్శిటీ అసిస్టెంట్ ఉపాధ్యక్షురాలు కాదంబరి

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్శిటీ ఉద్యోగావకాశాల కేంద్రం, బయో సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 'వాయిస్ ఫర్ బీటీ-బయో టెక్నాలజీ' అంశంపై దక్షిణ మండల 12వ వార్షిక వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బెంగళూరు, వేలూరు సహా పలు ప్రాంతాల నుంచి 24 కళాశాలలకు చెందిన 41 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం వర్సిటీ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వర్సిటీ అసిస్టెంట్ ఉపాధ్యక్షురాలు కాదంబరి హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏబీఎల్‌ఈ సంస్థ అధ్యక్షుడు కృష్ణన్, సీఈఓ నారాయణ సురేష్, జనరల్ మేనేజర్ బాలసుబ్రమణ్యన్, బిజినెస్ డైరెక్టర్ సంజీవ్ నీలప్ప, టెక్నాలజీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్, వర్శిటీ వైస్, ప్రొ ఛాన్సలర్ పార్థసారధి మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్మూరు కోఆప్టెక్స్ తిల్లయాడి వళ్లియమ్మై కేంద్రంలో దీపావళి దుస్తుల విక్రయాలను ప్రారంభిస్తున్న చేనేత శాఖ మంత్రి ఆర్.గాంధీ

హృద్రోగ చికిత్సల్లో అపోలో రికార్డు

- 500కు పైగా రోబోటిక్ హార్ట్ సర్జరీలు



మీడియా సమావేశంలో అపోలో గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, డాక్టర్ ఎంఎం. యూసఫ్ తదితరులు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హృద్రోగ శస్త్రచికిత్సల్లో నగరంలోని అపోలో ఆస్పత్రి 500 రోబోటిక్ హార్ట్ సర్జరీలు నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించిందని అపోలో గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు. నగరంలోని స్టార్ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీ లాగా ఛాతీపై పెద్ద కోతలు లేకుండా రోగికి ఎలాంటి రక్తస్రావ సమస్య లేకుండా ఈ శస్త్రచికిత్స నిర్వహిస్తారని వివరించారు. ఈ శస్త్ర చికిత్సలలో చిన్నపాటి రోబోటిక్ చేతులు, హైడెఫనిషన్ త్రీడీ కెమెరా వినియోగిస్తారన్నారు. రోబోటిక్ కార్డియాక్ సర్జరీ కన్సల్టెంట్ డాక్టర్ ఎంఎం యూసఫ్ నేతృత్వంలోని ప్రత్యేక వైద్య నిపుణుల బృందం రోబోటిక్ హార్ట్ సర్జరీలు చేసి ఆస్పత్రి కీర్తి పెంచారని ఆయన ప్రశంసించారు. ఈ చికిత్స ద్వారా రోగులు మరుసటి రోజే సంపూర్ణంగా కోలుకుంటున్నారని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా, రెండు మూడు రోజుల్లోరోజువారీ పనులు చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. డాక్టర్ ఎంఎం యూసఫ్ మాట్లాడుతూ 30 నుంచి 60 యేళ్ల లోపు వారికి ఈ రోబోటిక్ సర్జరీ వరం లాంటిదని తెలిపారు. మీడియా సమావేశంలో అపోలో ఆస్పత్రి వైద్యసేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వెంకటాచలం, రోబోటిక్ కార్డియాక్ సర్జరీ చీఫ్ సర్జెన్ డాక్టర్ సాత్యకి పి నంబాల, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గణపతి ఆరుముగం, సీనియర్ ఫిజీషియన్ అసిస్టెంట్ నీలకంఠన్ తదితరులు పాల్గొన్నారు.

శివోహం.. భారీ శివలింగానికి అభిషేకపూజలు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని బొమ్మి అమ్మాళ్ గురుమూర్తీశ్వర్ స్వామి ఆలయ ప్రాంగణంలో వున్న 42 అడుగుల శివలింగానికి భారీ క్రేన్ సాయంతో అభిషేకం నిర్వహించారు. పుణ్య నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలు ప్రోక్షించి అభిషేకం చేపట్టారు. ఈ ఆలయంలోని ఉత్సవ వ వారాన్న లక్ష సోవ వారం వ మహా కుంభాభిషేకం సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు జరిగాయి.



డీఎంకే పాలనలో లక్షలాది ఉద్యోగావకాశాలు

- స్పీకర్ అప్పావు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎంకే మూడున్నరేళ్ల పాలనలో సుమారు 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. తిరునల్వేలి అన్నా ప్లే గ్రౌండ్‌లో మంగళవారం ఉదయం జరిగిన అథ్లెటిక్ పోటీల్లో సుమారు 1,100 మందికి పైగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్తికేయన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రాంగణంలో ఒలింపిక్ జెండా ఎగురవేసి క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలు లబ్ధిపొందేలా పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. జిల్లాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించి ఇప్పటివరకు సుమారు 6లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అసెంబ్లీలో ప్రస్తుతం డీఎంకేకు చెందిన 132 మంది ఎమ్మెల్యేలు, 66 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలున్నారని,డీఎంకేకి మెజార్టీ అధికంగా ఉన్నప్పటికీ, అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షం అన్నాడీఎంకేకే ఎక్కువ సమయం మాట్లాడేందుకు అవకాశమిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ రామకృష్ణన్,డిప్యూటీమేయర్ రాజు,కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబి మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న స్పీకర్ అప్పావు

తీవ్రరూపం దాల్చనున్న ఈశాన్య రుతుపవనాలు

- నగరంలో ముమ్మరంగా ముందస్తు పనులు
- పరిశీలించిన మేయర్



సాదిక్‌బాషానగర్‌లో వాననీటి కాల్వ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చనుండటంతో వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. మంగళవారం ఉదయం ఆమె కోడంబాక్కం జోన్‌లో వాననీటి కాల్వల మరమ్మతు పనులను పరిశీలించారు. సాదిక్ బాషా నగర్, సంజయ్‌గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో పాత వాననీటి కాల్వల స్థానే కొత్తగా నిర్మిస్తున్న వాననీటి కాల్వ పనులను తనిఖీ చేశారు. ఇదే విధంగా 129వ వార్డు పరిధిలో పెరియార్‌నగర్ వీధిలో రూ.14 లక్షలతో చేపడుతున్న వాననీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ తర్వాత విరుగంబాక్కం కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పిచ్చిమొక్కల తొలగించే పనులను, శ్రీనివాసన్ నగర్‌లో కొత్త వాననీటి కాల్వ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. విరుగంబాక్కం శాసనసభ్యుడు ఏఎంవీ ప్రభాకర్ రాజా, జోనల్ కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కౌన్సిలర్లు పి.లోగు, ఆర్.స్టెల్లా, జాస్మిన్ రకత్నా, ఎం.రవిశంకర్ తదితరులు మేయర్‌తో పాటు పర్యటించారు.

చెట్ల కొమ్మల తొలగింపు..

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిస్తే దానికి సంబంధించిన ముందస్తు జాగ్రత్తలను అధికారులు చేపట్టరు. నగరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్ల కొమ్మలను కార్పొరేషన్ అధికారులు తొలగిస్తున్నారని మేయర్ ప్రియ తెలిపారు. జూలై ఒకటి నుంచి అక్టోబర్ 14 దాకా 15 జోన్లలో 45956 చెట్ల కొమ్మలను, అక్టోబర్ 10 నుంచి 19 దాకా 2708 చెట్ల కొమ్మలను తొలగించినట్లు ఆమె వివరించారు.

వాననీటి నిల్వ పరిస్థితులపై మ్యాప్‌లు...

నగరంలో ఏయే ప్రాంతాల్లో వర్షపునీరు అధికంగా ప్రవహిస్తుందనే వివరాలు నగరవాసులు సులువుగా తెలుసుకునేందుకు ప్రత్యేకంగా మ్యాప్ రూపొందిస్తున్నట్లు మేయర్ ప్రియా చెప్పారు. గత వారం నగరంలో 20 సెం.మీ. వరకు వర్షం కురిసినా ముందుగానే ఏయే ప్రాంతాల్లో వాననీటిలో మునుగుతాయనే పాత సమాచారాలను బట్టి ముందస్తు జాగ్రత్త చర్యలు సమర్థవంతంగా చేపట్టామన్నారు. ప్రస్తుతం నగరంలో, శివారు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే జలమయమయ్యే ప్రాంతాల, వీధుల వివరాలతో ప్రత్యేకంగా మ్యాప్‌లు రూపొందిస్తున్నామని, త్వరలో ఆ మ్యాప్‌లు నగరవాసులకు అందుబాటులోకి వస్తుందని ఆమె చెప్పారు.



అడయార్ గాంధీ నగర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

దీపావళి ప్రత్యేక రైళ్లు



వేళచ్చేరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06001 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కన్నియకుమారి ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ ఈ నెల 29, నవంబరు 5వ తేదీల్లో డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06002 కన్నియకుమారి-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 30, నవంబరు 6వ తేదీల్లో కన్నియాకుమారిలో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.15 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.
- నెం.06005 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సెంగోట్టై ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 30, నవంబరు 6వ తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.20 గంటలకు సెంగోట్టై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06006 సెంగోట్టై- చెన్నై సెంట్రల్ ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 31, నవంబరు 7వ తేదీల్లో సెంగోట్టై నుంచి రాత్రి 7.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.
- నెం.06037 చెన్నై సెంట్రల్-మంగళూరు జంక్షన్ ఫెస్టివల్ స్పెషల్ నవంబరు 2వ తేది చెన్నై సెంట్రల్‌లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు మంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06038 మంగళూరు-చెన్నై సెంట్రల్ ఫెస్టివల్ స్పెషల్ నవంబరు 3వ తేది మంగళూరులో సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.10 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.
- నెం.06049 తాంబరం-కన్నియాకుమారి ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 29, నవంబరు 5,12 తేదీల్లో తాంబరం నుంచి అర్ధరాత్రి 12.35 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.15 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06050 కన్నియాకుమారి-తాంబరం ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 29, నవంబరు 5, 12 తేదీల్లో కన్నియాకుమారిలో మధ్యాహ్నం 3.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.20 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ బుధవారం 8 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.



నామక్కల్ శిలంబగౌండర్ పార్కులో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



అలిపిరి నుంచి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని తిరుమల క్షేత్రానికి కాలినడకన చేరుకోవాలంటే 3,550 మెట్లు ఎక్కాల్సిందే. గోవింద నామస్మరణ చేసుకుంటూ, చెమటలు తుడుచుకుంటూ, కష్టాన్ని మర్చిపోయేలా స్వామి రూపాన్ని తలచుకుంటూ అడుగులేస్తున్న భక్తులకు ఏడో మైలురాయి వద్ద నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం తారసపడుతుంది. తిరుమల దగ్గరకు చేరుకుంటున్నామనే భావనా కలుగుతుంది. నడక మార్గంలో భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు వెనుక ఆసక్తికరపరిణామమే ఉంది.

1979లో ఏమైందంటే..

1990 వరకు దట్టమైన అడవి మధ్యలోనే తిరుమల క్షేత్రం ఉండేది. అలిపిరి కాలినడక మార్గంలో 1970 వరకు రోజుకు 400 నుంచి 500 మంది భక్తులు రావడమే ఎక్కువ. 1979లో ఏడోమైలు రాయి వద్ద ఓ మహిళ హత్య అప్పట్లో కలకలం సృష్టించింది. హత్య వివరాలు స్పష్టం కానప్పటికీ కాలినడక భక్తులను ఈ ఘటన ఆందోళనకు గురిచేసింది. అప్పటి టీటీడీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి నేరాలకు ఆస్కారముందని గ్రహించారు. దీంతో ఈ మార్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వయంగా నడిచి లోటుపాట్లను గుర్తించారు. ఎగుడుదిగుడుగా ఉన్న రాళ్లను సరిచేయించారు. తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. లైటింగ్ పెంచుతూ అక్కడక్కడ దుకాణాలు ఏర్పాటు చేయించారు. గోవిందనామస్మరణను గుర్తుచేసేలా బోర్డులు పెట్టించారు. నడకభక్తులకు లగేజి భారం తగ్గించేలా చూశారు. లగేజీ ఉచిత సరఫరా, పైకప్పు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులకు నాటి ఘటన కారణమైంది. ఫలితంగా ఏడాది వ్యవధిలోనే కాలినడక భక్తుల సంఖ్య నాలుగైదువేలకు పెరిగింది. అయినప్పటికీ ఏడో మైలు రాయి హత్యోదంతం పీవీఆర్కే ప్రసాద్ మదిని తొలుస్తూనే ఉండేది.

చేదు స్మృతి చెరిగి... భక్తి భావన పెరిగి..

● భద్రాంజనేయ విగ్రహం ఏర్పాటు నేపథ్యం

పెద్దాపురం శిల్పి సాయంతో...


ఈ క్రమంలో ప్రసాద్ తన సతీమణి గోపిక సొంతూరు కాకినాడ వెళుతున్న క్రమంలో పెద్దాపురంలో 12 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూశారు. వెంటనే కారు ఆపించి భక్తివెలుగులు మూర్తీభవిస్తున్న ఇలాంటి విగ్రహాన్ని తిరుపతిలోనూ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. పెద్దాపురం సమీపాన ఓ గ్రామంలో ఉన్న ఈ విగ్రహ శిల్పి తోగు లక్ష్మణస్వామితో మాట్లాడారు. తొలుత తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేషన్ భవనం(హుజూర్ ఆఫీస్) ముందు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తరువాత అలిపిరిలో గరుత్మంతుడి విగ్రహాన్ని కూడా అద్భుతంగా ఏర్పాటు చేయించారు. ఇన్ని చేస్తున్నా అలిపిరి ఏడో మైలు వద్ద హత్యఘటన, వేదన పీవీఆర్కే ప్రసాద్‌ను వీడలేదు. ఈ క్రమంలో ఆయనకు ఓ పరిష్కార ఆలోచన వచ్చింది. దాని ఫలితమే భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు. అదే శిల్పి ఆధ్వర్యంలో 1980లో ఏడోమైలు వద్ద పది అడుగుల పీఠంతో సహా 40 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని నిర్మింపజేశారు. ఇప్పుడు అక్కడ అంజనీపుత్రుడి విగ్రహం చూడగానే భక్తులకు నిండైన భక్తి భావన స్ఫురిస్తుంది. విగ్రహ శిలా ఫలకంపై 'శిల్పాచార్య తోగు లక్ష్మణ స్వామి' అనే పేరు నేటికీ కనిపిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రూ.2.79 కోట్లతో అభివృద్ధి పనులు

● వివిధ సంస్థలతో చెన్నై పోర్ట్ అథారిటీ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో పోర్ట్ ఉన్నతాధికారులు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా చెన్నై పోర్ట్ అథారిటీ రూ.2.79 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందు కోసం వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సోమవారం నగరం లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఒప్పందం పత్రాలపై చెన్నై పోర్ట్ అథారిటీ అధికారులు సంతకాలు చేశారు. ఈ నిధులతో కార్పొరేట్ గర్ల్స్ హైయ్యర్ సెకండరీ స్కూల్‌లో కొత్త తరగతి గదులను నిర్మిస్తారు. మద్రాస్ మెడికల్ కాలేజీలో సెమినార్ హాలులో మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ కోసం ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తారు. జిల్లా కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను సమకూర్చనున్నారు. డిజిటల్ లిటరసీలో భాగంగా వివేకానంద కల్చరల్ సెంటర్‌లో కంప్యూటర్ ల్యాబ్ నెలకొల్పనున్నారు. గ్రామీణ పునర్వికాస కార్యక్రమాన్ని అమర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శుద్ధ జలం పంపిణీ పథకంలో భాగంగా, బక్రర్ కీ రామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయాల్లో ప్యూరిఫైయింగ్ వాటర్ ప్లాంట్ నెలకొల్పుతారని చెన్నై పోర్ట్ అథారిటీ అధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేహోతో రెడ్‌స్టార్ పాలిమర్స్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన రెడ్‌స్టార్ పాలిమర్స్ కంపెనీలోని 51 శాతం వాటాను జర్మనీకి చెందిన రేహో కంపెనీ కొనుగోలు చేసింది. ఈ మేరకు ఈ రెండు సంస్థల మధ్య అవగాహనా ఒప్పందం, ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమం మంగళవారం నగరంలో జరిగింది. జర్మనీ ప్రధాన కార్యాలయంగా ఉన్న రెహో... ప్రపంచ వ్యాప్తంగా ఇంటీరియర్, బిల్డింగ్, విండోస్, రైల్వేస్ (మెట్రో), ఆటోమోటివ్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కోసం రెడ్ స్టార్ పాలిమర్స్‌తో ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కంపెనీకి ప్రపంచ వ్యాప్తంగా వందకుపైగా దేశాల్లో శాఖలుండగా, 20 వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలాగే, రెడ్‌స్టార్ పాలిమర్స్‌కు ఏపీలోని శ్రీసిటీలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ వుంది. పైగా దక్షిణ భారతదేశంలో ఒక బలమైన కంపెనీగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ఈ కంపెనీలోని 51 శాతం వాటాను రెహో కొనుగోలు చేసింది. ఈ కార్యక్రమంలో రెడ్‌స్టార్ పాలిమర్స్ డైరెక్టర్ ఎస్.కార్తికేయన్, రెహో సీఈవో ఆసియా పసిఫిక్ రాఫెల్ డమ్, రెహో సౌత్ ఆసియా డైరెక్టర్ ఫయాజ్ అహ్మద్, రెడ్‌స్టార్ పాలిమర్స్ డైరెక్టర్ లక్ష్మి పచ్చ తదితరులు పాల్గొన్నారు.

'ఎంవీ డయాబెటీస్'లో డీఎఫ్ఆర్ఐ శిక్షణా సంస్థ



సంస్థ లోగో ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ్ విశ్వనాథన్

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయపురంలోని ఎంవీ డయాబెటీస్ ఆస్పత్రిలో డీఎఫ్ఆర్ఐ పేరుతో ప్రత్యేక శిక్షణా సంస్థ ఏర్పాటైంది. అమెరికాకు చెందిన అకాడమీ ఆఫ్ వూండ్ హీలింగ్ (ఏపీడ బ్యూహెచ్) సహకారంతో దేశంలోనే తొలిసారిగా మధుమేహ రోగుల పాదాల వద్ద ఏర్పడే రణాలకు కొత్త రకం చికిత్సలకు సంబంధించి డయాబెటిక్ ఫుట్ రిసెర్చ్ ఇండియా పేరుతో శిక్షణాసంస్థ ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి మధుమేహ రోగుల పాదాల వద్ద ఏర్పడే రణాలు, వాటికి అందించాల్సిన చికిత్సపై సునిశిత శిక్షణ అందించనున్నట్లు ఎంవీ డయాబెటీస్ చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్ తెలిపారు. మధుమేహ రోగుల పాదాలకు ఎలాంటి సమస్య రాకుండా నిరోధించడానికే ఈ ప్రత్యేక శిక్షణా సంస్థ ఏర్పాటు చేశామన్నారు. న్యూయార్క్‌లోని ఏపీడ బ్యూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆంటోని ఇరియోజంక్ట్ ఈ నెల 23 నుంచి 25 వరకు తొలి శిక్షణా కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రకటించారు.

2 నుంచి తెలుగు శిక్షణా తరగతులు

● ప్రపంచ తెలుగు సమాఖ్య

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి ఉచిత తెలుగు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. ఆరు నెలల పాటు ప్రతి శనివారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు టి.నగర్, జీఎన్ చెట్టి రోడ్డులో వున్న అంకుర్‌ప్లాజాలోని సమాఖ్య కార్యాలయంలో ఈ తరగతులు జరుగనున్నాయి. ఈ తరగతులలో పాల్గొనదలచిన ఔత్సాహికులు 7305557322, 9841616465 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చని సమాఖ్య సెక్రటరీ జనరల్ శ్రీలక్ష్మీ మోహన్‌రావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో మంత్రి ఆకస్మిక తనిఖీ



పల్లావరం ఈఎస్ఐ ఆస్పత్రి మందుల షాపులో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న మంత్రి గణేశన్

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలోని ఈఎస్ఐ వైద్యశాల, ఆస్పత్రిలో రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి సీవీ గణేశన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఔట్ పేషంట్లకు అందిస్తున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరుపట్టీని ఆయన పరిశీలించారు. అక్కడి మందుల షాపులో మందులు స్టాక్ తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఆస్పత్రి వస్తున్న రోగుల సంఖ్య , వారికి లభిస్తున్న చికిత్స గురించి ఈఎస్ఐ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఇలంగో మహేశ్వరన్, ఇతర వైద్యులు వద్ద మంత్రి అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్య కార్మికురాలికి రూ.2.39 కోట్ల జీఎస్టీ

● దిగ్భ్రాంతి కలిగించిన ఓ లెటర్

బాధితురాలు రాణి బాబు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంబూరులో పారిశుధ్య కార్మికురాలు రూ.2.39 కోట్లు జీఎస్టీ చెల్లించాలంటూ ఆదాయపు పన్ను శాఖ పంపిన నోటీసు దిగ్భ్రాంతికి గురిచేసింది. తిరుపత్తూర్ జిల్లా ఆంబూరు సమీపం కృష్ణాపురానికి చెందిన రాణి బాబు (60) ఆ ప్రాంతంలోని ఓ కర్మాగారంలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. రాణిబాబుకు తిరుచ్చి జిల్లా పాలక్కరై ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం నుంచి నోటీసు వచ్చింది. అందులో... ఆమె రూ.2.39 కోట్ల జీఎస్టీ చెల్లించాలని, ఏడు రోజుల్లో పన్ను చెల్లించాలని ఉంది. నోటీసు చూసిన రాణి బాబు కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందారు. నోటీసుకు, తమకు సంబంధం లేదంటూ ఆంబూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, పేదరికంతో ఉన్న పారిశుధ్య కార్మికురాలికి రూ.2.39 కోట్ల జీఎస్టీ చెల్లించాలనే నోటీసుకు సంబంధించి కొత్త విషయాలు వెలుగుచూశాయి. తిరుచ్చి జిల్లా కల్లికుడి మనప్పారై రోడ్డు మలైపట్టి ప్రాంతంలో ఉన్న ఓ సంస్థ పేరు ఆ నోటీసులో ఉంది. ఆ సంస్థ యజమాని పేరు రాణి బాబు. అంటే రాణి బాబు పాన్ కార్డు, ఆధార్ కార్డు తదితరాలతో ఈ సంస్థ నమోదుచేసి ఉంది. ఈ సంస్థ పన్ను బకాయి రూ.1,07,50,284 కాగా, అందుకు జరిమానా రూ.1,07,05,294, వడ్డీ రూ.24,86,436 మొత్తం రూ.2,39,87,024 చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. రాణిబాబు పేరుతో సంస్థ ఉన్న నేపథ్యంలో, ఆ పేరుతోనే కేరళ రాష్ట్రం ఎర్నాకులం తిరుక్కాడకరై ప్రాంతంలో ఉన్న ఓ జాతీయ బ్యాంక్‌లో నగదు పరివర్తన కోసం ఓ ఖాతా కూడా ప్రారంభమై ప్రస్తుతం పనిచేస్తోంది. జీఎస్టీ బకాయిలు చెల్లించాలని రాణి బాబుకు గత జూలై నెలలోనే లేఖ వచ్చిందని సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేపట్టారు.

కామరాజ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



మంగళవారం మదురై కామరాజ్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సందర్భంగా వర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి, ప్రాచీన తమిళ పరిశోధన కేంద్రం వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ సుధా శేషయ్యన్ చేతుల మీదుగా పట్టాలు అందుకున్న విద్యార్థులు.



ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని చెన్నై క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ నెల 25న అరివాలయంలో జరుగనున్న తన గ్రంథావిష్కరణ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రి పొన్ముడి.



గత నెల కేరళలోని ఏటీఎం కేంద్రాల్లో దోపిడీకి పాల్పడి పారిపోతున్న ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి అవార్డులు, ప్రశంసలందుకున్న ఎస్పీ రాజేష్ కన్నన్ ఇతర పోలీసు అధికారులతో నామక్కల్ ప్రభుత్వ అతిథిగృహంలో ఫొటో దిగిన సీఎం స్టాలిన్

మచిలీపట్నం వైద్య కళాశాలకు 'పింగళి' పేరు

● ఏపీ సర్కారుకు కృష్ణారావు ధన్యవాదాలు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెట్టడాన్ని ద్రావిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావు స్వాగతిస్తూ, ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయంపై ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మచిలీపట్నం ప్రభుత్వం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు చేయడం పట్ల ఆయన అభినందిస్తున్నట్టు తెలిపారు. ఏపీలో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే ఎన్నో సంస్కరణలు చేయడమేకాకుండా, ఇటీవల బుడమేరు వరదల వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితులను సైతం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి వరద బాధితులను ఆదుకుందని ఆయన గుర్తుచేశారు. అలాగే, నానాటికీ మరుగునపడిపోతున్న స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు, వారి త్యాగాలను నేటితరం తెలుసుకునేందుకు విధంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు.

అట్టహాసంగా ముగిసిన 'ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నై'



పోటీల్లో అందగత్తెలతో నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నై 13వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఎగ్మోర్‌లోని ఒక స్టార్ హోటల్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ పోటీలకు పోటీదారులతో సహా అనేక మంది సెలెబ్రిటీలు పాల్గొన్నారు. ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నైలో భాగంగా 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకుల అందం, ప్రతిభ, వ్యక్తిత్వం, సానుకూల దృక్పథాన్ని గుర్తించేలా ప్రతి యేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో కాలేజీ విద్యార్థులతో పాటు మోడలింగ్, నటన రంగాల్లో రాణించాలని భావించే ఔత్సాహిక యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ తరహా పోటీలను 2012లో తొలిసారి ప్రారంభించి, గత 13 యేళ్ళుగా వరుసగా నిర్వహిస్తున్నారు. వివిధ దశల పోటీల తర్వాత మిస్టర్ ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నైకు 14 మంది పురుషులు, శ్రీమతి ఐరిస్ ఫేస్ ఆఫ్ చెన్నైకు 10 మంది మహిళలు ఎంపికయ్యారు. విజేతలకు సినీ నటి పార్వతి నాయర్, ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ రెనితా రాజన్, పాల్సన్ గ్రూపు ఆఫ్ కంపెనీస్ సీఈవో డాక్టర్ శ్యామ్ పాల్, నటి, మోడల్ ఉపాసన ఆర్‌సీ తదితరులు పాల్గొని కిరీట ధారణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు అనేక మంది సెలెబ్రిటీలు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో రైళ్ల రద్దు

నేటినుంచి మూడు రోజులు ప్రయాణాలకు ఆటంకం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు (25వ తేదీ వరకు) పలు రైళ్ల రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

23న రద్దయిన రైళ్లు..

కన్యాకుమారి-డిబ్రుగర్ ఎక్స్‌ప్రెస్ (22503), (17016), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ (12840), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై సెంట్రల్-షాలిమార్ (22826), పాండిచ్చేరి-భువనేశ్వర్ (12897), బెంగళూరు-గువహటి (12509), బెంగళూరు-హౌరా హంసఫర్ (22888), బెంగళూరు-హౌరా (12864), కామాఖ్యా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (12552), డిబ్రుగర్-కన్యాకుమారి వివేక్ (22504),

24న రద్దయిన రైళ్లు..

తిరునెల్వేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (06087), ఖరగ్‌పూర్-విల్లుపురం (22603), సంత్రాగచ్చి-మంగళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్ (22851), షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ (12841), హౌరా-తిరుచిరాపల్లి (12663), హౌరా-బెంగళూరు (12863), హౌరా-చెన్నై సెంట్రల్ (12839), పాట్నా-ఎర్నాకులం (22644), సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు (06090), చెన్నై సెంట్రల్-హౌరా కోరమాండల్ (12842), చెన్నై-సంత్రాగచ్చి ఏసీ (22808), బెంగళూరు-ముజాఫర్‌పూర్ (15227), తాంబరం-సంత్రాగచ్చి (06095), బెంగళూరు-హౌరా దురంతో (12246).